# నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, శనివారం 17 మే 2025 | MAHABUBABAD


## తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తాం



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, సివిల్ సప్లై డీఎం రాంపతి

- జీసీసీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు
- రైతులు అధైర్య పడొద్దు : అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ

నమస్తే ఎఫెక్ట్

ఏటూరునాగారం, మే 16 : ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపూర్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఫైసల్ హుస్సేన్ సందర్శించారు. 'నమస్తే తెలంగాణ' ఐదో పేజీలో శుక్రవారం ప్రచురితమైన 'మొలకెత్తిన వడ్లు.. రైతుల్లో దిగులు' కథనానికి అధికారులు స్పందించారు. మిల్లులకు తరలించకపోవడంతో వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో మొత్తం ధాన్యం తరలిస్తామని చెప్పారు. మల్లంపల్లి మండలంలోని వాసవీ రైస్ ఇండస్ట్రీస్, అచ్యుత బాయిల్డ్ మిల్లులకు తరలించేందుకు ఆదేశించినట్లు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ తెలిపారు. రైతు డిమికి లక్ష్మయ్య ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకొచ్చి కుప్పపోశాడని, వర్షం రావడంతో తడిసి మొలకలు వచ్చినట్లు తెలిపాడని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రైతు తడిసిన ధాన్యాన్ని కూడా తీసుకుంటామని, రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, కేంద్రంలో ఉన్న మొత్తం ధాన్యాన్ని జిల్లాలోని బాయిల్డ్ మిల్లులకు తరలించి కొనుగోలు చేస్తామని చెప్పారు. వర్షం వల్ల కేంద్రంలోకి లారీలు వెళ్లే అవకాశం లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా బస్తాలను రోడ్డు వరకు తెప్పించి లారీల్లో లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 9347416178కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వెంట స్థానిక డీటీ రాహుల్ వర్మ, జీసీసీ అధికారులు ఉన్నారు.

## ఎంజీఎం హాస్పిటల్‌లో పాము కలకలం

వరంగల్‌చౌరస్తా, మే 16: వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో నాగుపాము కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం ఓపీ సేవలు ప్రారంభమయ్యే సమయానికి రేడియాలజీ విభాగం (రూమ్ నంబర్ 92) సిబ్బంది ఎక్స్‌రే విభాగంలో పాము సంచరిస్తున్న విషయాన్ని గుర్తించారు. దీంతో రోగులు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సెక్యూరిటీ సిబ్బంది పామును బంధించి, నిర్జన ప్రదేశంలో వదిలేశారు. గతంలోనూ ఎంజీఎం వార్డులో పాములు సంచరించినప్పటికీ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంపై రోగులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎక్స్‌రే గదిలో ఉన్న నాగుపాము



జనగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే రాజయ్య, నాయకులు

### కడియం.. ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడు

**మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

కడియం శ్రీహరి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు.. ఒళ్లు దగ్గరపెట్టుకో కేసీఆర్, కేటీఆర్‌ను, పల్లా పేరెత్తితే నాలుక చీరేస్తా..జాగ్రత్త. అక్కడ సీఎం డబ్బులేవ్ అంటుంటే ఇక్కడ కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్లు తెచ్చానంటూ గొప్పులు చెబుతున్నాడు. ఆయన ఇప్పటి వరకు 8 పైసలు తేలేదు. ఇప్పుడు జరుగుతున్న పనులన్నీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరై..ప్రారంభమయ్యాయి. స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిలో కడియం పాత్ర గుండుసున్నా..ఆయనో ఐరెన్‌లెగ్ లీడర్. దేవాదుల విషయంలో ఆయన తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కడియం తలకిందకు..కాళ్లు పైకి పెట్టి నియోజకవర్గం మొత్తం ప్రదక్షిణ చేసినా డిపాజిట్ రాదు.

# ఓరుగల్లు పరువు తీసిన కాంగ్రెస్

- అందగత్తెల కాళ్లు కడిగించడం బాధాకరం
- దాన్ని మంత్రులు సంప్రదాయమనడం విడ్డూరం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## ఆడబిడ్డలకు సర్కారు క్షమాపణ చెప్పాలి

జనగామ, మే 16 (నమస్తే తెలంగాణ) : ఓరుగల్లు పరువు తీసిన కాంగ్రెస్ సర్కారు ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాలని జనగామ మ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామలోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలతో విదేశీ అందగత్తెల కాళ్లు కడిగించి రాణీ రుద్రమదేవి ధీరత్వం.. సమ్మక్క సారలమ్మల వీరోచిత పోరాట స్ఫూర్తిని దెబ్బతీసే లా చేశారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వం దివాలా తీసిందని ప్రకటించిన ముఖ్యమంత్రి కాస్మోటిక్ కంపెనీలకు లాభాలు తెచ్చే ప్రపంచ అందాల పోటీలు నిర్వహించడం దౌర్భాగ్యమని పేర్కొన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయి కన్నీళ్లు పెడుతున్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందాల పోటీలకు రూ. వందల కోట్లు మంటగలపడం శోచనీయమని అన్నారు. చారిత్రక నగరంగా..ఆలయాలకు నెలవైన వరంగల్‌కు ప్రపంచ సుందరీమణులను తీసుకొచ్చి ఇక్కడి మహిళల ధైర్యసాహసాల స్ఫూర్తిని చెబుతారని భావిస్తే అత్యంత అవమానకరంగా ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు రామప్ప దేవాలయం, వేయి స్తంభాలగుడి, యాదగిరి గుట్ట వంటి పుణ్యక్షేత్రాలను గౌరవంగా దర్శించారు తప్ప ఎవరూ ఇలాంటి పనులు చేయలేదన్నారు. తెలంగాణ మహిళా మంత్రులు దీన్ని మన సంప్రదాయంగా సమర్థించడం విడ్డూరమన్నారు. మన సంప్రదాయం ఇదేనా? సోకాల్డ్ తెలంగాణ మేధావులు ఎక్కడికి పోయారు?..మన సంస్కృతి ఏమైంది అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్రెగుట్టల్లో పిట్టలను కాల్చినట్టు కాలుస్తుంటే దాని గురించి మాట్లాడని వాళ్లు సంప్రదాయమని మాట్లాడుతుండడం దురదృష్టకరమన్నారు. దేశ చరిత్రలోనే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ మైలురాయిగా నిలిచిందని.. సభ విజయవంతానికి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ గులాబీ సైనికులు ప్రధాన భూమిక పోషించారని పేర్కొన్నారు. కేసీఆర్ ఎల్కతుర్తి సభలో మాట్లాడి తిరుగు ప్రయాణంలో దారి పొడవునా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికి అభిమానం చాటారన్నారు. సమావేశంలో కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు పోకల జమున, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధి లింగం, మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు తాళ్ల సురేశ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, పేర్ని స్వరూప, బీఆర్ ఎస్ నాయకులు బండ యాదగిరిరెడ్డి, ఇర్రి రమణారెడ్డి, బొల్లం శారద, ఉల్లెంగుల సందీప్, ఉడుగుల నర్సింహులు, సేవెల్లి మధు, దేవునూరి సతీష్, గుర్రం నాగరాజు, జూకంటి శ్రీశైలం, వై కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు పైసలు వసూల్..

ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ నాయకుల పైసల వసూల్‌కు కేరాఫ్‌గా మారుతున్నది. పల్లెల్లో అయితే రూ. 50 వేలు, పట్టణంలో రూ. లక్ష లంచం తీసుకొని ఎంపిక చేస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పైసలు ఇచ్చినోళ్లకో..లేకుంటే కాంగ్రెస్ నేతల బంధుగణానికో పథకం వర్తిస్తున్నది. అసలు ఇల్లు కట్టక ముందే లంచం తీసుకోవడం ఎంతవరకు సబబు. కలెక్టర్ జోక్యం చేసుకొని అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. లంచం తీసుకొని ఇచ్చారంటే శిక్షకు గురవుతారని అన్నారు. రాజీవ్ యువ వికాసం కూడా పైసలు వసూళ్లు మొదలుపెట్టారని, ప్రభుత్వం వద్ద పైసలు లేవ్ అంటూనే కింద వాళ్లు వసూలు చేసి ఎవరికి ఇస్తారో? ఎవరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తారో? చూడాలన్నారు.

## లాలించి.. పాలు పట్టించి..

**కోతి పిల్లలను తల్లిలా సాకుతున్న మేరీ..**



కోతి పిల్లలను లాలించి.. వాటికి పాలు పట్టించి తల్లిలా సాకుతున్నది మేరీ. కోతులను పట్టి అటవీప్రాంతంలో వదలడమే కాదు.. వాటి పిల్లల ఆలన, పాలన కూడా తాము చూసుకుంటామని చెబుతున్నది. కోతులను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలేందుకు కుటుంబంతో మహబూబాబాద్ నుంచి గూడూరు మండల కేంద్రానికి వచ్చిన మేరీ, తల్లులు వదిలేసిన పిల్ల కోతులకు పాలు పట్టి సాకుతున్నది. వాటిని అక్కున చేర్చుకొని సీసాతో పాలు పట్టిస్తున్నది. కొద్దిరోజుల తర్వాత పండ్లు తినిపించి నడవడం, చెట్లు ఎక్కడం వచ్చిన తర్వాత తిరిగి అటవీప్రాంతంలో వదిలేస్తామని మేరీ తెలిపింది.

– గూడూరు, మే 16



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- రెండో రోజూ కాళేశ్వరంలో సందడి
- త్రివేణి సంగమం వద్ద తాగునీటికి అవస్థలు
- అధికారుల తీరుపై ఆగ్రహం
- త్రివేణి సంగమంలో పూజలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నదీ తీరం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

# పెరిగిన రద్దీ.. సౌకర్యాల్లేక ఇబ్బంది



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

సరస్వతీ పుష్కరాలకు మొదటిరోజు అంతంత మాత్రమే ఉన్న భక్తుల సంఖ్య రెండో రోజు కొంత పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి వీఐపీ ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానాలు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి నదిలో దీపాలు, ఒడి వదిలారు. పిండ ప్రదానాలు, పితృతర్పణాలు సమర్పించారు. 17 అడుగుల అమ్మవారి విగ్రహానికి పూ జలు చేశారు. సెల్ఫీలు దిగి సంబురపడ్డారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా, వీఐపీ ఘాట్ వద్ద సరిపడా సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. షవర్లు అలంకారప్రాయంగా మారాయి. త్రివేణి సంగమం వద్ద తాగునీరు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. భానుడి ప్రతాపానికి తట్టుకోలేక భక్తులు సొమ్మసిల్లిపోయారు. కొందరు ఇసుకలో నడవలేక ఎడ్లబండ్లలో ఘాట్‌కు వెళ్లారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దంపతులు రాత్రి త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానాలాచరించారు. పూజలు చేసి గోదావరికి చీర, సారె సమర్పించారు. సరస్వతీ మాతను దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో చేపట్టిన నవరత్న హారతిని వీక్షించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

**పుష్కర మహోత్సవంతో**

గోదావరి కొత్త శోభను సంతరించుకున్నది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్నానాలు ఆచరిస్తుండడంతో నదీమ తల్లి పరవశిస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకోగా, భక్తుల రద్దీ స్వల్పంగా పెరిగింది. సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తజనం ఇబ్బంది పడింది. త్రివేణి సంగమం వద్ద తాగునీటికి అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

– మహదేవపూర్ (కాళేశ్వరం), మే 16

### సౌకర్యాలు బాగా లేవు..

కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలకు సౌకర్యాలు కల్పించలేదు. చిన్నారులు, వృద్ధులు ఘాట్ నుంచి త్రివేణి సంగమం వరకు నడవలేని పరిస్థితి ఉంది. వాహనం ఎక్కడో పార్క్ చేసి ఇంత దూరం ఎండలో నడవడం చాలా కష్టంగా ఉంది. సంగమ తీరంలో అక్కడక్కడా తాగునీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సరిపడా సౌకర్యాలు లేక నిరాశ చెందాం. అధికారులు స్పందించి సరైన వసతులు ఏర్పాటు చేయాలి. – వెంకటేశ్వర్లు, నర్సంపేట



## మండు వేసవిలోనూ జలధారలు

నయాగరా బొగత జలపాతం మండు వేసవిలోనూ జల ధారలు కురిపిస్తున్నది. స్థానికంగా, ఛత్తీస్‌గఢ్ గుట్టలపై శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవగా, వరద నీటితో జలపాతం ఆకట్టుకుంటున్నది. కొన్ని నెలలుగా బోసిపోయిన జలపాతం ఒక్కసారిగా నీటి ప్రవాహంతో చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నది. - వాజేడు, మే 16



వరద నీటితో ఆకట్టుకుంటున్న బొగత జలపాతం



ఏటూరునాగారం : వర్షంతో చిత్తడిగా మారిన జీసీసీ కొనుగోలు కేంద్రం



ఏటూరునాగారం : పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

# మళ్లీ వర్షం.. రైతుకు కష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కూలిన ఇండ్ల పైకప్పులు.. విరిగిపడిన చెట్లు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రభావం



నర్సింహులపేట: తడిసిన ధాన్యం బస్తాలను చూపుతున్న గుగులోత్ మల్లమ్మ

నమస్తే నెట్‌వర్క్, మే 16 : ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు తడిసిపోయాయి. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోగా, చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూలి కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. కురవి, సీరోలు మండలాల్లో కాంటా అయిన ధాన్యం సైతం వర్షానికి తడిసిపోయింది. గంగారం మండలం కొడిశలమిట్ట గ్రామంలో కల్లంలో తునికాకు కట్టలు చెల్లాచెదురయ్యాయి. నర్సింహులపేట మండలంలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు నానాపాట్లు పడాల్సి వచ్చింది. కల్లాల్లో మిర్చి తడిసి ముద్దయింది. ధాన్యం రాశులపై టార్పాలిన్లు గాలికి లేచిపోవడంతో ముంగిముడుగు, వంతడపలలో కాంటా పెట్టిన ధాన్యం బస్తాలు తడిశాయి. పెద్దనాగారం కొనుగోలు కేంద్రం లో పైసలు ఇచ్చిన వాళ్ల వడ్లు కాంటాలు పెడుతూ బస్తాలు తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. కాంటా పెట్టి న 200 బస్తాల వడ్లు తడిశాయని గుగులోత్ మల్లమ్మ కంట తడిపెట్టారు. ఏటూరునాగారం మండలంలో ఆరబోసుకున్న, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసుకున్న ధాన్యంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంట చేతికొచ్చే ముందు వడగండ్ల వానతో నష్టపోతే ఇప్పుడు తరచూ కురుస్తున్న అకాల వర్షాలతో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొత్తం తడిసిపోయింది. పాలకుర్తి మండలంలోని దర్దేపల్లిలో పిడుగు పాటుతో రెండు కాడెడ్లు మృతి చెందాయి. గాలి దుమారానికి పలువురి రేకుల ఇంటిపై కప్పులు లేచిపోయాయి.



గంగారం : కొడిశలమిట్టలో కల్లంలో చెల్లాచెదురైన తునికాకు కట్టలు

# అత్యవసర సేవలెప్పుడు?

- సూపర్ స్పెషాలిటీలో ప్రారంభం కాని ఎమర్జెన్సీ విభాగం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో అలంకార ప్రాయంగా మారిన వైనం
- ఆధునిక యంత్రాలున్నా ఎంజీఎం ఆస్పత్రే దిక్కు




కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఎమర్జెన్సీ విభాగం

వరంగల్ చౌరస్తా, మే 16 : కాకతీయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగం అలంకార ప్రాయంగా మిగిలింది. ఆధునిక యంత్ర పరికరాలున్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అత్యవసర సేవలు అందని పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు ఈ దవాఖానను కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర పది రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నా అత్యవసర విభాగాన్ని మాత్రం ప్రారంభించడం లేదు. అత్యాధునిక యంత్ర పరికరాలున్నప్పటికీ సేవల పరంగా ఎంజీఎం ఆస్పత్రే పెద్ద దిక్కుగా నిలుస్తున్నది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎంజీఎం దవాఖానాకే తీసుకెళ్తున్నారు. వీరిని వెంటనే తరలించేందుకు రవాణా వ్యవస్థ సైతం అందుబాటులో లేదు. అంబులెన్స్ కూడా ఎంజీఎం నుంచి రావాల్సిందే. ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా వాహనాలు లేకపోవడంతో చాలా మంది రోజులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించేందుకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న ముగ్గురు డ్రైవర్ల సేవలను కూడా ఎంజీఎం దవాఖానలోనే వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, వైద్యాధికారులు స్పందించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యవసర వైద్య విభాగాన్ని ప్రారంభించడంతో పాటు అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.